# అమ్మ

ఒయాసిస్సులు లేని ఎడారిలో ఒంటరి ప్రయాణం లాంటి జీవితం ఆమెది. ఎప్పటికీ అంతం కాని సుదీర్ఘమైన అమావాస్య రేతిరి లాంటి అంధకారం ఆమె జీవితం నిండా పర్చుకుని - ఆశలూ, ఆశయాలూ, కోరికలూ చొరలేని అనంతమైన శూన్యం - ఆమె మనసుని లోబర్చుకుని చాలా కాలమైంది. ఆమెకు పాతికేళ్ళుంటాయి. అద్భుతమైన అందం కాకున్నా అతి లాఘవంగా తన వైపుకు లాక్కునే ఆకర్షణ ఉంది ఆ కళ్ళలో. లోతుగా చూస్తే తప్ప అంతుబట్టని చిక్కటి చీకటి లాంటి నిరాశ అర నిమిషానికోసారి తళుక్కుమని మెరిసి విరిసే ఆ కళ్ళ లోపలి పొరల్లో ఎక్కడో ఏదో మూల . . . . నిక్షిప్తంగా - గోప్యంగా.. . . .

వయసు సహజంగా కురిపించే వరాల్లాంటి - వంటి నునుపుదనం - అవయవాల్లో నిండుదనం - కదలికలో ఆడతనం ఆమెలో సంపూర్ణంగా రేకులు విప్పుకున్నాయి. వాటితో పాటే తన విశాలమైన పడగ విప్పిన ఒంటరితనం ఆమెను తన నీడలోకి బలవంతంగా లాక్కుంది.

అపుడపుడూ అకస్మాత్తుగా దాడిచేసే బాల్యం నాటి జ్ఞాపకాలు మొదట వసంత సమీరంలా హాయిగా - పిదప ప్రకోపిత గ్రీష్మంలా బాధాకరంగా ఆమె హృదయంతో క్రూరంగా ఆడుకుంటూ ఉంటాయి.

అందరి జీవితాల్లానే ఆమె బాల్యం కూడా అతి మధురంగానే గడిచింది. అమ్మ ప్రేమ- తండ్రి వాత్సల్యం - తన అల్లరీ - అమ్మ మందలింపూ - చందమామని చూపిస్తూ గోరుముద్దలు- రాజుల కథలూ - స్నేహితురాళ్ళతో ఆడుకునే గుజ్జెన

గూళ్ళూ - ఎండావానా -తొక్కుడుబిళ్ళ - ఓహ్ -స్వర్గంలోంచి - ఓ తీయటి స్వప్నం లోంచి - విసురుగా- క్రూరంగా - విధి విషాదంలోకి- విషం లాంటి వర్తమానంలోకి విసిరేసింది.

ఆమె పదో తరగతిలో ఉన్నప్పుడు ప్రైవేట్ కంపెనీలో పనిచేసే ఆమె తండ్రి ఉద్యోగం పోయింది. కన్నీళ్ళతో యజమాని కాళ్ళు కడగటానికి వెళ్ళిన ఆమె తల్లి శీలం పోయింది. ఆ అవమానం భరించలేని తల్లిదండ్రులు - ఆ దుర్మార్గం సహించలేని ఆమె తల్లిదండ్రులు - దుర్మార్గంగా ఆమెను ఒంటరిని చేసి - ఆకలికి - అంతకన్నా భయంకరమైన మనుషులకు ఆమెను బలిచేసి - ఈ లోకం నుండి వెళ్ళిపోయారు.

ఆమెకు మిగిలింది ఒకటే ఆస్తి - తన శరీరం - ఇంకా పూర్తిగా వికసించని తన యవ్వనం - తన అందం. జీవితం వూరకుక్కలు కాట్లాడుకునే ఎంగిలి విస్తరాకులా కాకుండా కాపాడింది తన కొద్దిపాటి చదువూ - కాసింత తెలివితేటలూ, ప్లస్ చలపతీ. ఆమె జీవితంలో చలపతే లేకపోతే ఏ వేశ్యాగృహంలోనో ఆమె అందమైన శరీరం కుళ్ళిపోయి ఉండేది. చలపతి ఆమెకో చక్కని యిల్లు చూసి పెట్టాడు. రోజుకో వ్యక్తిని తెచ్చే బాధ్యత నెత్తిన వేసుకున్నాడు. రోజుకు ఒక్కరే . బాగా ధనవంతుల్ని తెచ్చేవాడు - మరలా భద్రంగా ఇంటికి పిల్చుకుని వచ్చేవాడు.

చలపతి ఆమె శరీరాన్ని ఎన్నడూ తాకలేదు. ఆమెను ఏనాడూ కోరలేదు. అతనికి ఆ కోరికలు ఉన్నాయో లేవో కూడా ఆమెకు తెలియదు. అతి మృదువుగా అమ్మలా మాట్లాడే చలపతి ఆమెకు స్త్రీలానే అన్పించేవాడు. అతను యాక్సిడెంట్‌లో అకస్మాత్తుగా చనిపోయే వరకూ ఆమెకూ తెలియదు - అతను పెంచుకుంటున్న ఓ కొడుకున్నాడని. . . . అతనికి పదేళ్ళని . . . . ఎవరో అభాగ్యురాలు అతి సహజమైన కోరిక ఓ అనామకుడితో తీర్చుకున్న కారణంగా పుట్టిన పసికందు అమాయకంగా ఆకాశాన్ని చూస్తూ ఏడుస్తుంటే - పెంట కుప్పలోంచి అపురూపంగా ఎత్తుకొచ్చి పెంచుకున్నాడన్న విషయం అప్పుడే తెల్సిందామెకు.

వ్యాపారంలోని మెళుకువలూ - ఆటుపోట్లు ఆకళింపు చేసుకున్న ఆమె పదేళ్ళ ఆ బాబుని ధైర్యంగా తెచ్చుకుంది. ఔను, ఆమె స్త్రీ - పరిపూర్ణమైన స్త్రీ.

☆ ☆ ☆

అతనికి పదిహేడేళ్ళు వచ్చాయి - నూనూగు మీసాలు. . . . వాటితో పాటు మనసు నిండా విషక్రిముల్లా ముసురుకునే అల్లరి ఆలోచనలు కూడా వచ్చాయి.

ఆమె తన శరీరం కరిగించి చెప్పిస్తున్న చదువు అతనికి వంటబట్టటం లేదు. పుస్తకాల మధ్యలో - జాగ్రత్తగా కత్తిరించి పెట్టుకున్న తారల అర్ధనగ్న చిత్రాలు - అతని మనోభావాలకు శిలాఫలకాల్లా దర్శనమిస్తాయి - అతను ఆమె ఎత్తుల వైపు చూసే చూపు అతని ఉద్దేశాన్ని ఎలుగెత్తి చాటుతుంది.

అతనికి పదేళ్ళ వయసునించీ ఆమె తెలుసు. మొదట్లో అతనికి అంతగా అర్థం కాలేదు - ఆమె ఉదయం పడుకుని రాత్రిళ్ళు ఎందుకు మేల్కొంటుందో. . కొత్త కొత్త వాళ్ళు ఎందుకు వస్తుంటారో. . . వాళ్ళు ఆమెకేమౌతారో. . .

ఆ తర్వాత తెల్సింది. . .రాత్రిళ్ళు ఆ గదిలో ఏం జరుగుతుందో. . . ఆమె కళ్ళు ముద్ద మందారాల్లా. . . . మంకెన పూల్లా ఎందుకు ఉంటాయో. . . .

లోపలి నుంచి విన్పించే గుసగుసలూ. . . . పకపకలూ. . . . అదో రకం శబ్దాలూ - అన్నీ అర్థమైనాక - అతని రక్తం ఉప్పెనలా పొంగి - కోరిక విషపు నాగులా బుస కొట్టి - అతను ఎన్నో రాత్రుళ్ళు నిద్ర లేకుండా గడిపాడు.

అతను ఆమె కళ్ళలోకి సూటిగా చూడలేక పోతున్నాడీమధ్య. ఆమె స్నానం చేస్తున్నప్పుడు అతని కళ్ళలో వూహల ఉయ్యాల వూగుతో ఆమె నగ్నత్వం - ఆమె గదిలో వేరొకరితో ఉన్నప్పుడు అతని గుండెల్లో వేదన - రోషం - కోపం - వాణ్ణి బైటికీడ్చి తన్ని తరిమేసి ఆమెను ఆక్రమించు కోవాలన్న పశువాంఛ.

అతనిలో తరిగిపోతున్న సహనం - పెరిగిపోతున్న కోరిక.

ఆ రోజు అకస్మాత్తుగా అతను ఆమె గదిలోకి ప్రవేశించాడు. మాగన్నుగా నిద్ర పడ్తున్న ఆమె ఉలిక్కిపడి లేచింది. అతను కోరికగా. . . ఎర్రగా నిప్పులా చూశాడామెవైపు. ఆమె ప్రశాంతంగా "ఏం కావాలి" అని అడిగింది.

"ముద్దు" అన్నాడు. ఆమె అతనికి సమీపంగా జరిగి అతని తలని దగ్గరకు లాక్కుని నుదుటి మీద ముద్దు పెట్టుకుంది. అతనిజుట్టు నిమురుతూ, "నీవు పసివాడిగా ఉండి ఉంటే నీ పెదవుల మీద బోల్డు ముద్దులు ఇచ్చేదాన్ని - ఇపుడు పెద్దవాడివైనావు కదా" అంది. ఆమె కళ్ళు చల్లగా. . . వెన్నెల వరించిన ఆకాశంలా ఉన్నాయి.

అతను తల వంచుకుని చెప్పాడు - "నాకు నీవు కావాలి" అని. . .

ఆమె అతన్ని తన గుండెలకు అదుముకుంది. అతని వీపు చుట్టూ చేతులు వేసి "నేనెప్పుడూ నీ దాన్నేరా కన్నా - నాకు నీవు దేవుడిచ్చిన బిడ్డవు. నేనెంత వేశ్యనైనా స్త్రీనే - తల్లి అయ్యే అదృష్టం ఓ ధనికుడు ప్రసాదించిన రోగం వల్ల పూర్తిగా నాశనమై పోయింది. నా ఒంటరి జీవితానికి తోడుగా భగవంతుడు నిన్ను పంపించి మాతృ హృదయం అనుభవించే తీయటి అనుభూతిని నాకు ప్రసాదించాడు. . . . " అతన్ని ఇంకా గట్టిగా హత్తుకుని భోరుమంది.

అతను ఆమె పాదాలు చుట్టుకుని ఏడుస్తున్నాడు - బిగ్గరగా - హృదయ విదారకంగా-

ఆమె అతన్ని చుట్టుకుని ఏడుస్తోంది - గుండెలు కరిగిపోయేలా -

విషాదం అలుముకున్న ఆ గదిలో ఓ మాతృమూర్తి తన విశాలమైన హృదయంతో - క్షమతో - ప్రేమతో - ఓ కొడుకుని అక్కున చేర్చుకుంది.

కణకణ మండే ఓ మనసు గర్భం చీల్చుకుని ఓ కొడుకు పువ్వులా జన్మించాడు.

● *విశ్వరచన, 1 అక్టోబర్, 1998* ●